కథ

# నీతికథలు

**వి. యల్. వి. భారతి**

**"జీవహింస చెయ్యరాదు**
**అబద్ధము ఆడరాదు**
**దొంగతనం చెయ్యరాదు**
**పరుల సొమ్ము పామువంటిది**
**నిదానమే ప్రధానం"**

''రవీ!... రవీ!''

సునీత రెండుసార్లు పిలిచినా నీతివాక్యాలు వల్లిస్తున్న రవికి తల్లిమాట వినపడలేదు.

''ఒరేయ్ రవీ!'' ఈసారి గట్టిగా అరవడంతో చదువు ఆపి తలెత్తి చూశాడు ఆరోక్లాసు చదువుతున్న రవి.

ఎదురుగా అమ్మ గుడ్లురిమి చూస్తోంది. చేతిలో పెన్సిలు బాక్సు.

''చెప్పు. ఇదెక్కడిది?''

''.....''

''నిన్నే. మాట్లాడవేం?''

''అదీ...అదీ... రాము ఇచ్చాడు'' కాస్త తడబడ్డాడు.

''అబద్ధం. ఇంత ఖరీదైన బాక్సు... పైగా కొత్తగా ఉంది. వాడు నీకెందుకిచ్చినట్టు?''

ఏం చెప్పాలో తెలియక మౌనంగా దిక్కులు చూస్తున్న కొడుకుని మరోసారి గద్దించింది ఆమె. అప్పుడు గుర్తొచ్చింది పది రోజుల్నుంచీ రాము కొన్న పెన్సిలు బాక్సు లాంటిదే తనకీ కొనమని రవి పేచీ పెట్టడం.

ఓ పక్క మిక్కీమౌస్ బొమ్మ. మరోపక్క ఏదో ద్రవంలో తేలియాడుతున్న బంగారు రంగు చేప పిల్లల బొమ్మలతో రెండంతస్తులున్న అందమైన బాక్సు అది. అంత ఖరీదైనది తమకి కొనే స్థోమత లేదు. ఏదో నచ్చచెబుతూ వాడి కోరికని దాటవేస్తూ వస్తున్నారు. ఇప్పుడు దాని కోసం దొంగతనం చేశాడన్నమాట.

''నిజం చెప్పు.. దొంగతనం చేశావు కదూ?''

''లేదు మమ్మీ! నిజంగా నీ మీద ఒట్టు. రాము కొత్తది మరోటి కొన్నాడట. అందుకని ఇది నాకు ఇచ్చేశాడు.''

రవి గబుక్కున అబద్ధం చెప్పటం పైగా తన మీదే అంత తేలిగ్గా ఒట్టు పెట్టడం ఎంతో బాధనిపించింది సునీతకి.

''సరే! రేపు స్కూలుకొచ్చి రామునే డైరెక్టుగా అడుగుతాలే. నువ్వు చదువుకో'' ఆ బాక్సుతో సహా గిర్రున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది సునీత.

రవి గుండెలో రాయి పడింది. అమ్మ నిజంగా స్కూలుకి వస్తుందేమో? అమ్మో ఇంకేమైనా ఉందా?

అసలు మూడు రోజుల్నుంచే ఆ బాక్సు ఎలా కాజెయ్యాలా అని ప్లాను వేస్తున్నాడు. సాయంత్రం గేమ్స్ పీరియడ్‌లో అంతా గ్రౌండులో ఆడుతుంటే తను మాత్రం పిల్లిలా జారుకుని క్లాసుకొచ్చి వాడి బాక్సు కొట్టేసి తన బ్యాగులో పెట్టేశాడు. ఇంటికొచ్చే దాకా గుండె స్పీడుగా కొట్టుకుంటూనే ఉంది భయంతో.

రేపు వాడు టీచర్‌కి చెప్పి ఆమెతో పేరు పేరునా అందర్నీ అడిగేట్టు చేస్తాడు. కాబట్టి కడుపునొప్పి వంకతో రెండు రోజులు డుమ్మా కొట్టేయాలన్న ప్లాను కూడా ఉంది.

ఇప్పుడిప్పుడే తనకి కాస్త మంచి మార్కులు వస్తున్నాయన్న గుడ్ ఇంప్రెషన్ వస్తోంది టీచర్‌కి. ఈ టైములో అమ్మ వచ్చి బాక్సు గురించి రాముని ప్రశ్నిస్తే....?

ఛా! అలా జరక్కూడదు.

సాటి పిల్లల ముందు, టీచరు ముందు పరువు పోవడం కంటే ముందుగా అమ్మ దగ్గరే తప్పు ఒప్పేసుకుంటే సరి.

''అమ్మా'' అంటూ మీద చెయ్యేసి ఆమె మొహంలోకి చూశాడు.

ఆమె కనుకొలకుల్లోంచి కన్నీరు ధారాపాతంగా కారి తలగడలోకి ఇంకిపోతోంది.

''సారీ మమ్మీ! మూడు తప్పులు చేశాను'' తల్లిని చుట్టేసి బావురుమన్నాడు.

''మూడు తప్పులా?'' సునీత గొంతులో ఆశ్చర్యం.

''దొంగతనం చేశాను. నీకు అబద్ధం చెప్పాను.''

''మరి మూడో తప్పు?''

''ఈ రెండు తప్పులూ చేసి పైగా నీ మీద ఒట్టు పెట్టాను'' తల్లి ఒడిలో మొహం దాచుకుని కుచ్చిళ్లని కన్నీటితో తడిపేశాడు.

సునీత కొడుకు తలపై చెయ్యేసి లాలనగా నిమిరింది.

''చూడు రవీ! తప్పు చెయ్యని వాడంటూ ప్రపంచంలో ఎవరూ ఉండరు. అది తప్పని తెలుసుకుని దాన్ని దిద్దుకుని నీతిగా బతకడం బుద్ధిమంతుల లక్షణం. పోయిన నెల ఫాన్సీడ్రెస్ కాంపిటీషన్‌లో నువ్వు గాంధీ తాత వేషం వేశావు. అప్పుడు చెప్పిన నీతివాక్యాలు గుర్తున్నాయా?''

మౌనంగా తలూపాడు రవి.

''గాంధీ తాత కూడా చిన్నప్పుడు కొన్ని తప్పులు చేశాడు. చిన్న చిన్న దొంగతనాలు, అబద్ధాలు చెప్పడం లాంటివి. కానీ సత్యహరిశ్చంద్రుడి కథ తెలుసుకుని జీవితాంతం సత్యమే పలకాలని, ప్రాణం పోయినా అబద్ధం చెప్పకూడదని నిర్ణయించుకుని దానికే కట్టుబడి బతికాడు. హరిశ్చంద్రుడు రాజ్యం కోల్పోవలసి వచ్చినా భార్యని నడిబజార్లో అమ్మాల్సి వచ్చినా, ఆఖరుకి తనను తాను అమ్ముకోవలసి వచ్చినా అబద్ధం ఆడ్డానికి మాత్రం ఇష్టపడలేదు. అలాంటి మహా పురుషులకి వారసులం. మన సంస్కృతీ, పురాణాలు 'సత్యమేవ జయతే' అని ఘోషిస్తున్నాయి. చక్కగా చదువుకుని బుద్ధిగా పైకి రావాల్సిన వాడివి. దొంగతనాలు, అబద్ధాలు లాంటివి నేర్చుకుని ఈ మురికి కూపంలో బ్రతుకుతావో లేక చక్కని సంస్కారంతో ఎదిగి అమ్మానాన్నలకీ, దేశానికీ పేరు తెస్తావో నీ ఇష్టం.''

అమ్మ చెప్పే ప్రతీ మాటా అమృతబిందువుల్లా సోకాయి రవి చెవికి.

''రేపు రాముకి ఆ బాక్సు ఇచ్చేసి సారీ చెప్పేస్తానమ్మా. ఇది మాత్రం అబద్ధం కాదు. నిజం'' దృఢంగా అన్నాడు రవి.

★ ★ ★

ఆ రాత్రి నిద్ర పట్టలేదు రవికి.

పాపం! రాముని వాళ్లమ్మ బాక్సు ఏదని అడిగితే ఏం చెప్పి ఉంటాడు? 'కొత్త బాక్సు. అంత డబ్బు పోసి కొన్నదీ పోగొట్టేశావా?' అంటూ వాళ్ల నాన్న, వీడి వీపు మీద మద్దెల దరువు వాయించి ఉంటాడా?

అమాయకంగా గుడ్ల నీరు నింపుకున్న రాము మొహం కళ్ల ముందు కనిపించేసరికి రవికి గుండె ద్రవించింది.

రెండు నెలల క్రితం తనకి టైఫాయిడ్ జ్వరం వస్తే రాము రోజూ ఇంటికొచ్చి తనకి నోట్సు



అవీ
రాసి పెట్టేవాడు. ఇన్నాళ్లు మిస్ అయిన లెక్కలు నేర్పించి ఇంగ్లీషు గ్రామరులో డౌట్స్ తీర్చేవాడు. వాడి స్నేహంతో కదూ తను కాస్త క్లెవరుగా తయారై టీచర్ దగ్గర మంచి ఇంప్రెషను తెచ్చుకోగలిగాడు. అంతటి మంచి వాడి విషయంలోనా తను ఇలా నీచంగా ప్రవర్తించింది.

పాపం! వాడు వాళ్ల అమ్మా నాన్నల చేతుల్లో ఎన్ని తన్నులు తిన్నాడో?

ఆ మధ్య కొత్త టిఫిను బాక్సు తనది వారం రోజులు వాడకుండానే స్కూలు బస్సులో మర్చిపోయి దిగేశాడు. తెల్లారి బస్సు డ్రైవరునీ, తోటి పిల్లల్నీ అడిగితే అందరూ మాకు తెలీదన్నారు.

నాన్న మాత్రం ఇంటికొచ్చాక అది పోయినందుకు చావగొట్టేశాడు. ఆ దెబ్బలు తనింకా మర్చిపోలేదు.

ఇప్పుడు రాముని కూడా అలాగే చెయ్యని తప్పుకి వాళ్ల నాన్న ఎంతలా శిక్షిస్తున్నాడో కదా!

తన మనోభావాలన్నీ డైరీలో అక్షరాలుగా పొందుపరుస్తుంటే కన్నీళ్లు ఆగలేదు రవికి.

★ ★ ★

''డాడీ! ఎల్లుండి రిపబ్లిక్‌డే కదా! మా క్లాసు రూము డెకరేషన్ చేసుకుంటున్నాము. నా వాటాకి ఈ దేశ నాయకుల బొమ్మలన్నీ ఓ చార్టుకి అతికించి తీసుకెళ్లాలి. ఓ పది రూపాయలివ్వరూ గమ్ బాటిలు కొనుక్కోవాలి.''

''వెధవ గమ్ము బాటిల్ కోసం పది రూపాయలు తగలేయాలా? అవసరం లేదు. ఆఫీసులో బోల్డు పడి ఉన్నాయి. సాయంత్రం వచ్చేటప్పుడు తెస్తాన్లే'' అంటున్న తండ్రి వంక సాలోచనగా చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు రవి.

''ఒరేయ్ రవీ! పెరట్లోకెళ్లి కాస్త కరివేపాకు కోసుకు రారా'' తల్లి ఆజ్ఞతో పెరట్లోకెళ్లాడు. ఏదో అనుమానం వచ్చి పరిశీలనగా చూశాడు చెట్టుని.

అంతే! ఎర్రబడిన మొహంతో గిరుక్కున వెనక్కి తిరిగి వచ్చేశాడు.

''ఎన్నిసార్లు చెప్పినా ఉన్న చోటు నుంచి కదలవు కదరా!'' విసుక్కుంటూ తనే వెళ్లింది సునీత.

★ ★ ★

''డాడీ! ట్యూషను కోసం ఓ లాంగ్ నోటు బుక్ కావాలన్నాను తెచ్చారా?''

''ఆ! టేబుల్ సొరుగులో పెట్టాను తీసుకో!'' పుస్తకం తీసి ఆశ్చర్యపోయాడు రవి.


అది లాంగు నోటు బుక్కే. కానీ దాని మీద ప్రతి పేజీలోను డాడీ ఆఫీసు పేరు ముద్రించి ఉంది.

''ఇది నాకొద్దు'' అంటూ పుస్తకం విసిరేసి ట్యూషన్‌కి వెళ్ళిపోతున్న కొడుకుని చూసి ఉగ్రుడయ్యాడు.

''బాగా పొగరెక్కింది వీడికి. పెద్దలంటే నిర్లక్ష్యం. అస్సలు గౌరవం లేదు. వేలకు వేలు పోసి చదివిస్తున్నాం. ఎందుకూ ఆపాటి సంస్కారం లేకపోయాక?''

## పెరిజాద్ అదృష్టం

**సినిమా రంగంలో ఒకరి దురదృష్టం మరొకరికి అదృష్టాన్నిస్తుంది. అపూర్వ లఖియా కొత్త చిత్రం విషయంలో ఇదే జరిగింది. అర్జున్ రాంపాల్ హీరోగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో తొలుత దియామీర్జాని హీరోయిన్‌గా ఎంపికచేశారు. అయితే ఏం జరిగిందో ఏమో గానీ ఆ తర్వాత దియాని కాదని పెరిజాద్ జొరాబియన్‌కి ఆ ఛాన్స్ వచ్చింది. అసలే అవకాశాలు లేక కుదేలైపోతున్న దియాకి ఇది మూలిగే నక్కమీద తాటి పండు చందంగా ఉంటే పెరిజాద్ మాత్రం బాగా ఆకలేసినప్పుడు మంచి ఫుడ్ తిన్న ఫీలింగ్‌తో ఉన్నట్టుంది.**



ధుమధుమలాడుతున్న భర్తకేసి చూసింది సునీత.

''ఔనండీ! వీడి ప్రవర్తన గత కొద్ది రోజులుగా అదోలా ఉంటోంది. తనలో తనే మథనపడిపోతుంటాడు. ఒక్కోసారి దీనంగా మొహం పెట్టి దిగులుగా కూర్చుంటాడు. మరోసారి ఏదో కోల్పోయినట్టు అలా శూన్యంలోకి చూస్తూ గంటల కొద్దీ గడిపేస్తాడు. అలా వాడిని చూస్తే భయం వేస్తోంది కూడా. ఆ..! అన్నట్టు వాడు రోజూ డైరీ రాసుకుంటాడుగా. అది చూస్తే తెలుస్తుందేమో! వాడి ప్రవర్తనకి అసలు కారణం ఏంటో!''

వాడి అలమర అంతా వెతికి డైరీ తెచ్చింది సునీత.

డైరీలో పేజీలు చదువుతున్న కొద్దీ ఇద్దరికీ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

★ ★ ★

''బాబూ! రవీ! మమ్మల్ని క్షమించు. నీకు నీతులు చెప్పి మేమే తప్పటడుగు వేశాం. మా ప్రవర్తన వల్ల నువ్వెంత బాధపడుతున్నావో నీ డైరీ వల్ల తెలిసింది. నిన్ను నీతిమంతుడిగా, సంస్కారవంతుడిగా తీర్చిదిద్దాలని నీలో మార్పు రావాలని మేము నిత్యం కృషిచేస్తూ నీకు ఎన్నో నీతి కథలు చెప్పాం. మహాపురుషుల ఆదర్శవంతమైన జీవిత గాథలు వివరించాం. కానీ ఆ సంస్కారమేదో మాలోనే లోపించిందని గ్రహించలేకపోయాం.''

''గతంలోని మా ప్రవర్తన తలుచుకుంటే మాకే సిగ్గుగా ఉంది. మనం పాటించినపుడే ఎదుటి వారికి నీతి చెప్పే అర్హత ఉంటుందని గ్రహించాం. మేం ఆ అర్హత కోల్పోయాం. నువ్వు మా అంచనాలకి మించి ఎదిగావు. మాకు మా ప్రవర్తన విషయంలో కనువిప్పు కలిగించావు''

తనని నిద్ర లేపి మరీ పొగుడుతున్న తల్లిదండ్రులకేసి పూర్తిగా వదలని మత్తు కళ్ళతో అయోమయంగా చూశాడు రవి.

ఆ తర్వాత ఆనందం, ఆశ్చర్యం ఒక్కసారిగా ఉప్పెనలా ఎగిసిపడ్డాయి వాడిలో.

''ఔను బాబూ! 'వెనకింటి వారి పెరట్లోని చెట్టే కదా! మనింటి వైపు వాలిన కొమ్మల్లోంచి నాలుగు కరివేపాకు రెమ్మలు కోసుకుంటే తప్పేముందిలే' అని ఇంతకాలం భావిస్తూ వచ్చాను. కానీ మనది కానిది ఏదీ వారి పర్మిషను లేకుండా తీసుకున్నా అది దొంగతనం కిందే లెక్క. ఈ విషయంలో ఇంతకాలం నేను తప్పు చేసినట్టే కదా! నేను గుర్తించలేకపోయిన ఇంత సూక్ష్మ విషయాన్ని నాకు తెలిపావు. రియల్లీ యు ఆర్ గ్రేట్.''

ఇప్పుడు నిద్రమత్తు పూర్తిగా వదలి అమ్మ అంటున్నదేంటో బాగా అర్థమైంది రవికి.

''నాన్నా రవీ! ఆఫీసు వస్తువులే కదా ఏం ఫర్వాలేదులే అనుకుని ఇంతకాలం గమ్, పుస్తకాలు, పెన్సిళ్ళూ, కాగితాలు లాంటివి తెచ్చి నీకిచ్చాను. కానీ మనకి అన్నం పెట్టి పోషిస్తున్న ఆ ఆఫీసులోనే దొంగతనానికి పాల్పడుతున్నట్లు ఇప్పటిదాకా భావించనే లేదు. ఇది ఎంతటి నీచకార్యమో తెలిసొచ్చింది. ఈ విషయంలో మా ప్రవర్తన వల్ల నువ్వు ఎంత నలిగిపోయావో అర్థమవుతోంది.''

''ఇది చాలా సాధారణ విషయమేలే అనుకుంటూ మాకు తెలియకుండానే మేం ఎంత పొరపాటు పనులు చేస్తున్నామో మా దృష్టికి తీసుకొచ్చావు. ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించం. నీకు బాధ కలిగించం. మాకు చేతనైనంతలో మేమే ఇతరులకి సహాయం చేస్తాం తప్ప ఇక ఎన్నడూ పరాయి సొమ్ముమీద ఆశపడం. ఈ విషయంలో మాకు నువ్వే ఆదర్శమూర్తివి''

అంటున్న తండ్రి వంక ఆనందంగా మెరిసే కళ్ళతో చూసి తన చిన్నారి చేతుల్ని అతని మెడచుట్టూ వేసి చటుక్కున తండ్రి బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు రవి.